ప్రజాశక్తి

మంగళవారం 26 ఆగస్టు 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పింఛన్లు తొలగించడం తగదు

అనకాపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వికలాంగులు

- రద్దు నోటీసులు ఉపసంహరించుకోవాలి
- విశాఖ, అనకాపల్లి కలెక్టరేట్ల వద్ద వికలాంగుల ధర్నాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి

అనర్హుల పేరుతో అసలైన వికలాంగుల పింఛన్లు తొలగించడం సరికాదంటూ విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టరేట్ల ఎదుట వికలాంగులు సోమవారం ధర్నాలు నిర్వహించారు. పిజిఆర్ఎస్‌లో వినతులు సమర్పించారు. పింఛన్లు తొలగించి తమ పొట్టకొట్టొదని వేడుకున్నారు. పింఛను స్లాబ్‌ల్లో మార్పులు చేసి తక్కువ పింఛన్ వచ్చే స్లాబుకు తమను పరిమితం చేయొద్దని విన్నవించారు. కొద్ది రోజులుగా ప్రభుత్వం ఇస్తున్న పింఛను రద్దు నోటీసులను ఉపసంహరించుకోవాలన్నారు.

విశాఖ కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు, వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్) రాష్ట్ర నాయకులు ఎత్తుల డేవిడ్ రాజు మాట్లాడారు. పింఛన్ రద్దు నోటీసులు అందుకున్న వికలాంగులు తీవ్ర కలత చెందుతున్నారన్నారు. పలుచోట్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పింఛన్ నిధులు తగ్గించుకునే క్రమంలో ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోందని విమర్శించారు. పింఛన్ల రద్దు నోటీసులు అందుకున్న వారు తిరిగి అప్పీలు చేసుకుని, వైకల్యాన్ని నిర్ధారించుకుంటే పింఛను పునరుద్ధరిస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆ ప్రక్రియ మిగతా 2లో..

విశాఖలో ధర్నా చేస్తున్న వికలాంగులు

సేవల్లో మేటి.. తిరుమల శ్రీదేవి

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక

ప్రజాశక్తి - భీమునిపట్నం

ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఆమెను దేశం మెచ్చింది. పిల్లలను ఆప్యాయంగా పలకరిస్తూ, మురిపెంగా సాకుతూ, విద్యా బుద్ధులు నేర్పుతున్న ఆమెను ఉపాధ్యాయలోకం అంతెత్తున నిలబెట్టింది. అంతటి మేటి సేవలందించిన ఆమె మన జిల్లా ఉపాధ్యాయిని కావడం గర్వకారణం.

జివిఎంసి మూడో వార్డు పరిధిలోని పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల శ్రీదేవి జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. 'ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ టీచింగ్' అంశాన్ని ఆధారంగా చేసుకుని జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక ప్రక్రియ జరిగింది. ఉపాధ్యాయ వృత్తిలో అనుభవం, బోధించే విధానం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న విద్యా శాఖ నిపుణుల బృందం జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఆమెను ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో జిల్లా విద్యాశాఖాధికారి, రాష్ట్ర స్థాయిలో కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, జాతీయ స్థాయిలో కేంద్ర విద్యాశాఖ అధికారులతో కూడిన నిపుణుల బృందం పరిశీలన అనంతరం ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆమె సోమవారం తెలిపారు.

పిల్లలకు బోధిస్తున్న తిరుమల శ్రీదేవి

ఉపాధ్యాయ వృత్తిలో శ్రీదేవి ప్రస్థానమిలా..

2001లో విశాఖ నగరంలోని ఎంవిడిఎం (మహారాణి విద్యావతి దేవి) ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా చేరారు. దాదాపు 9 ఏళ్ల పాటు ఇదే పాఠశాలలో పనిచేశారు. తదుపరి విశాఖ నగరంలోని చినవాల్తేరులోని కెడిపిఎం (కురుపాం దుర్గా ప్రసాద్) పాఠశాలలో దాదాపు 12 ఏళ్లు స్కూల్ అసిస్టెంట్‌గా పని చేశారు. ఇదే పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయునిగా ప్రమోషన్‌పై భీమిలిలోని జివిఎంసి మూడో వార్డు పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాలకు 2021 డిసెంబర్‌లో బదిలీపై వచ్చారు. ఆమె జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపికవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నో అవార్డులు

2018లో సావిత్రీబాయి మిగతా 2లో..

ఆదివాసీ యువతికి మెడికల్ సీటు

వార్త 8లో..

అధిక ధరలకు ఎరువుల విక్రయాలు

వార్త 7లో..

బలవంతపు భూ సేకరణ ఆపాలని నిరసన

వార్త 8లో..

స్మార్ట్ రేషన్‌కార్డు అందజేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వెలగపూడి

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

తొలిరోజు 5616 మందికి అందజేత

వార్త 4లో..

ఆందోళనకు దిగిన క్లాప్ డ్రైవర్లు

క్లాప్ డ్రైవర్‌పై జోనల్ కమిషనర్ దాడి

ప్రజాశక్తి - భీమునిపట్నం

జివిఎంసి రెండో వార్డు ఆదర్శ నగర్ - 2 సచివాలయం పరిధిలో సోమవారం విధుల్లో ఉన్న క్లాప్ వాహన డ్రైవర్ ఇంటి శ్రీనివాస్‌పై జివిఎంసి జోనల్ కమిషనర్ బమ్మి అయ్యప్ప నాయుడు చేయి చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న సహచర క్లాప్ వాహన డ్రైవర్లు వాహనాలను నిలిపివేసి జోనల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. రోజువారీ ఆకస్మిక పర్యటనలో భాగంగా ఆదర్శనగర్‌లో జెడ్‌సి పర్యటించారు. చెత్త సేకరణలో భాగంగా ఇంటింటికీ వాహనం రావాల్సి ఉండగా ఒకే చోట వాహనం నిలిపివేసి చెత్త సేకరిస్తున్నారంటూ సదరు డ్రైవరుపై కొందరు స్థానికులు మిగతా 2లో..

నేడు ఉదయగిరి, హిమగిరి జలప్రవేశం

ముఖ్య అతిథిగా హాజరు కానున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత నావికా దళానికి చెందిన ఉదయగిరి, హిమగిరి ఫ్రంట్‌లైన్ స్టీల్త్ ఫ్రిగేట్‌లను భారత నావికాదళం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతులమీదుగా మంగళవారం ప్రారంభించనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. విశాఖపట్నంలో రెండు ప్రతిష్టాత్మక భారతీయ షిప్‌యార్డుల నుండి రెండు ప్రధాన ఉపరితల పోరాట నౌకలను ఒకేసారి ప్రారంభించడం ఇదే మొదటిసారి. హిమగిరి నౌక కొల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ నిర్మిస్తున్న పి17ఎ నౌకలలో మొదటిది కాగా, పి17ఎ స్టెల్త్ ఫ్రిగేట్స్‌లో రెండో నౌక అయిన ఉదయగిరిని ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది. ఈ రెండు నౌకలనూ ఒకేసారి ప్రారంభించడం రక్షణ రంగంలో మేక్ ఇన్ ఇండియా ఆత్మనిర్భర్ భారత్ విజయాన్ని ప్రతిబింబిస్తుందని అధికారులు తెలిపారు. ఉదయగిరి నేవీ వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించిన 100వ నౌకగా గుర్తింపు పొందింది. ఈ రెండు మిగతా 2లో..

ఉదయగిరి

హిమగిరి

మొదటి పేజీ తరువాయి..

పింఛన్లు తొలగించడం తగదు

కఠినతరంగా ఉందన్నారు. వైకల్యం ఉన్న వారిని పదేపదే ఆఫీసుల చుట్టూ తిరగాలని చెప్పడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. పింఛన్ డబ్బులే ఆసరాగా బతుకుతున్న కుటుంబాలు రాష్ట్రంలో లక్షల్లో ఉన్నాయన్నారు. వారి నోటికాడి కూడును లాక్కోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్షులు పాల వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి కలెక్టరేట్ ఎదుట వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ఆధ్వర్యాన జరిగిన ధర్నాలో వేదిక జిల్లా కార్యదర్శి బుగిడి నూకప్పారావు మాట్లాడారు. రీ వెరిఫికేషన్ ప్రక్రియలో వికలాంగులకు అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి అర్హులైన వారందరికీ పింఛన్లు కొనసాగించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాపేటి భాస్కరరావు, నాగరాజు, అప్పారావు, బుద్ధ ధనలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, శ్రీనమ్మ, వెంకటలక్ష్మి, రాజబాబు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వికలాంగులు ధర్నా చేశారు. ఎంపిడిఒ దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇస్తున్న పెన్షన్ మొత్తాన్ని పెంచి లబ్ధిదారుల సంఖ్యకు కోత పెట్టడం దారుణమన్నారు. మండలంలో 160 మందికి పింఛన్ల రద్దు నోటీసులు వచ్చాయన్నారు. చిన్నచిన్న కారణాలు చూపి పింఛన్ నిరాకరించడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.సోమనాయుడు, పిట్ల వరాలమ్మ, జగదీష్ పాల్గొన్నారు.

నేడు ఉదయగిరి, హిమగిరి జలప్రవేశం

నౌకల నిర్మాణంలో 200 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఇ సంస్థలు పనిచేశాయి. దాదాపు 4 వేల మంది ప్రత్యక్ష ఉద్యోగులు, పది వేల మంది కంటే ఎక్కువ పరోక్ష ఉద్యోగులు భాగస్వాములయ్యారు.

క్లాప్ డ్రైవర్‌పై జోనల్ కమిషనర్ దాడి

జెడ్‌సికి ఫిర్యాదు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరిస్తూ అక్కడే ఉన్న క్లాప్ వాహన డ్రైవర్ శ్రీనివాస్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా నేరుగా అతని చెంప చెల్లుమనిపించారు. సమాచారం తెలుసుకున్న సహచర డ్రైవర్లు జోనల్ కార్యాలయం వద్దకు ఉన్న పళంగా వచ్చి బైఠాయించి ఆందోళనకు దిగారు. వారికి సిఐటియు జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మద్దతు తెలిపి మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే మందలించడమో, షోకాజ్ నోటీసు ఇవ్వడమో చేయాలి తప్పితే ఏకంగా చేయి చేసుకోవడం జెడ్‌సి స్థాయి అధికారికి తగని పని అని అన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో జెడ్‌సి తన కార్యాలయానికిరాగా ఆయన ఛాంబర్‌ను డ్రైవర్లు చుట్టుముట్టారు. దాడి ఘటనపై డ్రైవర్ శ్రీనివాస్‌కు క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. అందుకు జెడ్‌సి వివరణ ఇస్తూ విధులు సక్రమంగా నిర్వహించడం లేదన్న ఫిర్యాదుతో ఆగ్రహం పట్టలేక చేయి చేసుకున్నాను తప్పితే, ఉద్దేశ్య పూర్వకంగా చేయలేదని చెప్పుకొచ్చారు. ఇక నుంచి ఇటువంటి పొరపాట్లు జరగవని తెలిపారు. దీంతో డ్రైవర్లు ఆందోళన విరమించి విధుల్లోకి వెళ్లారు.

సేవల్లో మేటి.. తిరుమల శ్రీదేవి

పూలే అవార్డు, 2022లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయిని అవార్డు, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. సెప్టెంబర్ 5వ తేదీన టీచర్స్ డే సందర్భంగా న్యూఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకోనున్నట్లు తిరుమల శ్రీదేవి తెలిపారు.

నేడు జర్నలిస్టుల వినాయక చవితి వేడుకలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఎపి స్మాల్అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టివినాయక విగ్రహాలు పంపిణీ చేయనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు,ఫెడరేషన్ విశాఖ అధ్యక్షులు పి.నారాయణ తెలిపారు. సోమవారం వేమన మందిరంలో సంఘాల సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి, ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా చవితి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. మంగళవారం ఆశీలమెట్ట వేమన మందిరంలో ఉదయం 10 గంటల నుంచి 600 మంది జర్నలిస్టులకు మట్టి వినాయక విగ్రహం, వినాయక వ్రతకల్పం, పూల, పండ్ల మొక్కలను అందజేయనున్నట్లు చెప్పారు. కావున జర్నలిస్టులు పాల్గొని విగ్రహాలను స్వీకరించాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్‌కాస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, కె.మధన్, స్మాల్అండ్‌మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్‌మోహన్ పాల్గొన్నారు.

12న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విశాఖపట్నం జిల్లాశాఖ సర్వసభ్య సమావేశాన్ని కలెక్టర్, ఇండియన్ రెడ్డిస్ సొసైటీ అధ్యకుడు ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ నిర్వహించనున్నారని, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ రెడ్డిస్ సొసైటీ, విశాఖపట్నం జిల్లాకు చెందిన పేట్రాన్స్, వైస్ పేట్రాన్స్ ,లైఫ్ మెంబెర్స్ ,లైఫ్ అసోసియేట్ మెంబెర్స్ అందరూ తమ ఆధార్ కార్డ్, సభ్యత్వ కార్డులతో సెప్టెంబర్ 12 న ఉదయం 11 గంటలకు విశాఖపట్నంలోని రామాటాకీస్ దగ్గర అంబేద్కర్ భవన్‌కు హాజరు కావాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కనీసం 10 మంది సభ్యులతో కూడిన జిల్లా బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ ఎన్నుకోబడుతుందని వారు చైర్మన్,వైస్ చైర్మన్, కోశాధికారులను తమలో తాము ఎన్నుకుంటారని అన్నారు. జిల్లా సహకార అధికారి ఎన్నికలను నిర్వహించనున్నారని తెలిపారు.

ఇపిఎస్ 95 పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇపిఎస్ 95 పెన్షనర్ల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.ధీనబంధు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన రూ.20 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డిఎలను వెంటనే ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పిఆర్‌సి కమిషనర్‌ని నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీం కింద అన్ని రకాల వ్యాధులకు, అన్ని రకాల కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఉచిత వైద్యం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ ఇహెచ్ బిల్లులను వెంటనే మంజూరు చేసి చెల్లించాలన్నారు. కమ్యూటేషన్ రికవరీ కాలపరిమితిని 118 నెలలకు తగ్గించి ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

నినాదాలు చేస్తున్న పెన్షనర్లు

1 నుంచి ఈ-ఆఫీస్ ద్వారానే ఫైళ్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పరిపాలనాపరమైన సౌలభ్యం నిమిత్తం సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అన్నిరకాల ఫైళ్లను ఈ-ఆఫీస్ విధానంలోనే సమర్పించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆయా శాఖలకు ఇప్పటికే ప్రత్యేకలాగిన్లు ఇచ్చామని, వాటి ద్వారా ఫైళ్లను ఆన్ లైన్ మోడ్‌లోనే పంపించాలని నిర్దేశించారు. పాతపద్ధతిలో ఫైళ్లను పంపితే అనుమతించబోనని కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం పిజిఆర్ఎస్ అనంతరం అధికారులకు దీనిపై ఆదేశాలు జారీ చేశారు. ఆయా శాఖల పరిధిలోని జివోలు, మోమోలు, ఇతర అంశాలను ఈపిటిఎస్ డాక్యుమెంట్ల రూపంలో అప్లోడ్ చేయాలని సూచించారు. ఐ.గాట్ కర్మయోగి సర్టిఫికేట్ కోర్సులను చేయాలని, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నివేదికలను సమర్పించాలని చెప్పారు.

స్థానిక పత్రికలకు అక్రిడేషన్లు పెంచాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ప్రెస్ అక్రిడేషన్స్ జిఒఎంఎస్ 84/ 2025 సవరించాలని కోరుతూ ముఖ్యమంత్రి పంపే నిమిత్తం లోకల్ న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం సోమవారం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాసమస్యల ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో కలిసి సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ జిఒ స్థానిక దినపత్రికలకు ఎంతో నష్టం కలిగించే విధంగా ఉందని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాన్ని పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నేత్రదానంపై అందరికీ అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ భవనంలో జెసి కె. మయూర్‌అశోక్, సంబంధిత విభాగాల అధికారులతో కలిసి కలెక్టర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ పి. జగదీశ్వరరావు,ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ శంకర్ ప్రసాద్ ,డిఎల్ఓ డాక్టర్ ఆర్ రమేష్, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు, రీజనల్ ఐ హాస్పిటల్ ఆర్ఎంఒ డాక్టర్ నవీన్‌కుమార్, ఆప్తాల్మిక్ ఆఫీసర్లు ఉమా శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యాయపరమైన అంశాలపై అవగాహన

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : న్యాయసేవాసదన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రజలకు న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయసేవల ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్ సన్యాసినాయుడు మాట్లాడుతూ, ఎస్సి ఎస్టి వర్గాల ప్రజలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టడానికి చట్టపరమైన హక్కులు, డిఎల్ఎస్ఎ ద్వారా అందుబాటులో ఉన్న ఉచిత న్యాయసేవలు గురించి వివరించారు

అభ్యంతరాలుంటే విచారణ చేపడతాం

- 'దళితుల భూములకు స్కెచ్' ప్రజాశక్తి కథనంపై జెసి స్పందన

ప్రజాశక్తి - గేటర్ విశాఖ బ్యూరో : విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో 'దళితుల భూములకు స్కెచ్' అంటూ సోమవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనంపై జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పందించారు. దళితుల పట్టభూమిపైగానీ, బంజరులో ఆక్రమణదారుల విషయంలో పొరపాట్లు జరిగితే వాటిని తమ దృష్టికి తీసుకొస్తే విచారణ చేపడతామని తెలిపారు. సోమవారం తన ఛాంబర్‌లో 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ తర్లువాడ భూములకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ల్యాండ్ పూలింగ్ ప్రభుత్వం చేయడం లేదని, భూ సేకరణ మాత్రమే జరుపుతోందని అన్నారు. పెద్ద సంస్థలు వస్తే స్థానికులకు ఉపాధి దొరుకుతుందని భావిస్తున్నామని తెలిపారు. అదంతా ప్రభుత్వ భూమి అయినందున పట్టాదారులే కాకుండా, బంజరులో ఆక్రమణదారుల వివరాలను అధికారికంగా సేకరించామన్నారు. తర్లువాడ చుక్కకొండ చుట్టూగల భూముల్లో ఏయే పంటలు ఇంతవరకూ వేసారో ఉద్యానవన, అటవీ శాఖా అధికారుల లెక్కలను సేకరిస్తున్నామన్నారు. బంజారులో సాగులో ఇంత వరకూ లేని వారి పేర్లు ఏమైనా పరిహారంలో వచ్చి చేర్చి ఉంటే వివరాలు ఇస్తే విచారణ చేపడతామన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.A NO. 205/2024 AND I.A NO. 206/2024
IN O.S NO. 37/2021

BETWEEN:
Gudla Trinadha Rao ......Petitioner / Plaintiff
AND
Baratam Indira and others ...Respondent / Defendant

To

R-3: BARATAM SANDHYA RANI, D/O BARATAM LATE VENKATA RAO, AGED ABOUT 28 YEARS, HOUSEHOLD DUTIES, RESIDENT OF FLAT NO-401, ADITYA ARCADE APARTMENT, KOYYANA KANNAYYA COLONY, ARASAVILLI, SRIKAKULAM TOWN AND DISTRICT.

NOTICE

Take notice that the applicant by the above petition is filed and posted for hearing at **10:30** A.M on **24.09.2025** before the above said Court and if you want to contest the matter you may do so either in person or by a duty instructed Pleader and if you fail to show cause matter will be decided in your absence and exparte.

MS VINAY BHUSHANA RAO, Advocate,
NEW Colony, Srikakulam.
Andhra Pradesh. Ph: 9440112861

IN THE HON'BLE COURT OF THE IInd ADDL. JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.A.No. 464/2024 O.S.No.293 /2021

Between:
Machupalli Prakash
... Petitioner / Defendant
And:
Rokkam Gowri Sankar
. . . Respondent / Plaintiff

NOTICE

Rokkam Gowri Sankar,
S/o. Ramarao, D.No.43-4-15,
TF-403, Andhra Palace,
Railway New Colony,
Visakhapatnam.

పై నెంబరు దావానందు IA 464/24 ను Sec 5 Petition along with order 9 rule 13 CPC దాఖలు చేయ్యగా సదరు I.A.464/24 నందు మీకు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినూ మీకు చేరని కారణంగా యీపేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం తే:3-9-2025 దీకి వాయిదా అయివున్నది. కావున **తే: 03-09-2025దీన ఉదయం 10-30 ని॥లుకు** పై కోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెల్పగలరు. లేనిచో సదరు I.A. మీ పరోక్షమందు తీర్మాణించడ మగును.

(By Court Order)
R.PARMESWARA RAO
P.APPARAO
Advocates, Visakhapatnam.
Cell : 9110761608

IN THE HON'BLE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE
AT: VISAKHAPATNAM
I.A.26/2025, I.A.1030/2014
in O.S.76/2010

Between:
Sri Grandhi Ramji & another
...Petitioners
And:
Dharmala Appana Reddy & others
...Respondents

NOTICE

To,
R-2:Sri Dharmala Seetha Rama Reddy
S/o. Late Pothayya, aged 77 years, R/at Phase-III, MIG-3, Rajiv Nagar, Vinayaka Temple Road, Kurmannapalem, Visakhapatnam-46.
R-5: Smt. Boyi Atchiyyamma,
W/o. B. Appa Rao, aged 69 years, Battu, Palavalasa, Pedagantyada Mandal, Visakhapatnam.
R-6: Smt. Dharmala Appala Narasamma
W/o. Late Appanna, Aged 79 years, R/at Kongapalem, Pedagantyada Mandal, Visakhapatnam.
R-8: Smt. Chilla Yellayyamma,
W/o. Late Kanakayya, Aged about 71 years, R/at D.No. 65-3-40, Hanumansanjeevini Colony, Malkapuram, Visakhapatnam.

Whereas the petitioners herein filed the I.A. 1030/2014 in the above suit to set aside the preliminary decree dated 18-02-2011 and consequent thereupon to dismiss I.A.959/2011 which is pending on the file of the above Hon'ble Court. While so, the petitioners filed another I.A.26/2025 to receive the documents in evidence in support of the case in I.A. 1030/2014. There upon the Hon'ble Court is pleased to order Notice by way of paper publication against the respondents 2, 5, 6 and 8. Please take Notice that the above matter stands posted to **10-09-2025** at **10:30 A.M.,** for your appearance, in default of your appearance on that day the I.A.26/2025 will be heard and determined in your absence basing on the material available in the Court.

(M. RAMDAS) Advocate,
50-116-1, 1st Floor, Royal Court,
Seethammadhara N.E.,
Visakhapatnam-13

పలుచోట్ల రక్తదాన శిబిరాలు

రక్తదానం చేసిన విద్యార్థులతో ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్, బ్లడ్ సెంటర్ సహకారంతో మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. అవంతి విద్యా సంస్థల ఎన్ఎస్ఎస్ విభాగం, విశాఖ బ్రహ్మ కుమారీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 300 మంది విద్యార్థులు రక్త దానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులను ముత్తంశెట్టి అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్‌టిఆర్ బ్లడ్ సెంటర్ వైద్యులు సోమశేఖర్, పి.సత్యనారాయణ, క్యాంప్ అడ్మినిస్ట్రేటర్ ఆర్.సునీత, సిబ్బంది సేవలందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఎఒ కోలా చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి షరీఫ్, సిస్టర్ శివ లీల, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

గాజువాక : ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ప్రముఖ న్యాయవాది అండి బోయిన లక్ష్మి కోరారు. ఓంశాంతి దాదాజీ 18వ స్మృతి దినోత్సవం సందర్భంగా పెదగంట్యాడలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, ఈ రక్తదాన శిబిరాన్ని దేశవ్యాప్తం చేస్తూ లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించడాన్ని అభినందించారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ గోవిందరెడ్డి, ఓం శాంతి ప్రతినిధులు సింధు, భవాని, వరలక్ష్మి, సతీష్‌రెడ్డి, నితీష్‌రెడ్డి అండిబోయిన శ్రీను పాల్గొన్నారు.

రక్తదాతలతో ప్రముఖ న్యాయవాది అండిబోయిన లక్ష్మి

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ దుర్మరణం

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి చెందినట్లు సిఐ కుమారస్వామి వెల్లడించారు. ప్రమాద సంఘటన ప్రాంతాన్ని ఎస్ఐ సన్నిబాబుతో కలిసి పరిశీలించారు. వివరాలివి. తుని వైపు నుండి నక్కపల్లి వైపు వస్తున్న కూరగాయల లోడు లారీ ఒడ్డిమెట్ట, గొడిచెర్ల మధ్య లారీ టైర్ పంచర్ అవ్వడంతో, దాన్ని మార్చుచేసే పనిలో ఉండగా, వెనుక నుంచి సిమెంట్ మిక్సింగ్ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన లారీ క్లీనర్ ప్రదీప్ ప్రమాణిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన లారీ డ్రైవర్‌ను వైద్యసేవలకు తరలించారు. ట్రైనీ ఎస్ఐ సాహిబా అంజుమ్ కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని రేఖవానిపాలెంలో అప్పుల బాధ తాళలేక లేక ఓ వ్యక్తి ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కెఆర్‌టిఎస్ వెంకటేష్ (36) కుటుంబంతో కలిసి బతుకు తెరువు కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి సుమారు రెండేళ్ల క్రితం భీమిలి మండలం రేఖవానిపాలెం గ్రామానికి వచ్చారు. ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న ఇతను అప్పుల పాలయ్యాడు. అప్పుల బాధ తాళలేక ఆదివారం రాత్రి గన్నేరు పిక్కలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఇతన్ని కుటుంబ సభ్యులు, స్థానికులు కెజిహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సిఐ బి.తిరుమల రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గొలుసు తస్కరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : కాలినడకకు వచ్చిన మహిళ మెడ నుంచి బంగారు గొలుసును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తెంపుకుపోయిన ఘటన సోమవారం తెల్లవారు జామున జాతీయరహదారిలో విమ్స్ ప్రధాన ద్వారం వద్ద చోటు చేసుకుంది. ఆరిలోవ నేర విభాగం ఎస్ఐ హరికృష్ణ కథనం ప్రకారం... జివిఎంసి 10వ వార్డు ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన కృష్ణవేణి వైద్యుల సిఫారసు మేరకు సోమవారం తెల్లవారు జామున సుమారు 6 గంటల సమయంలో ఆదర్శనగర్ నుంచి విమ్స్ వైపు జాతీయరహదారిలో కాలినడకన వచ్చారు. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి కృష్ణవేణి మెడలో నుంచి సుమారు 3 తులాల బంగారు తాడును తెంపుకు పోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ క్రైమ్ ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపకరణాల శిబిరం

ప్రజాశక్తి- పద్మనాభం : వికలాంగులకు ఉపకరణాలను అందించేందుకు మండల కార్యాలయంలో మంగళవారం గుర్తింపు కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపిడిఒ ఎం.విజయకుమార్ తెలిపారు. విశాఖపట్నంలోని ది ఎబిలిటీ పీపుల్ సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని వయసుల వారికి వెన్నుముక సమస్యలు, ప్రమాద బాధితులను పరీక్షించి, అవసరమైన వారికి సహాయ ఉపకరణాలు, చక్రాల కుర్చీలు, త్రిచక్ర వాహనాలు, కృత్రిమ అవయవాలు, పిల్లల కోసం ప్రత్యేక పరికరాలు కూడా అందిస్తారని వివరించారు.

కెజిబివిలో హాట్ అండ్ కూల్ వాటర్ మిషన్

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలంలోని కెజిబివి పాఠశాలలో హాట్ అండ్ కూల్ వాటర్ మిషన్ ఏర్పాటు చేశారు. ప్రముఖ సంఘసేవకులు కొట్యాడ నారాయణరావు కుమారుడు కొట్యాడ సత్యమూర్తి రూ.10 వేల విలువైన మిషన్‌ను అందజేశారు. కొట్యాడ సత్యమూర్తికి స్కూల్ కమిటీ, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ కోరుకొండ శివాజీ, ప్రిన్సిపల్ ఎస్.సత్యలావణ్య, కెజిబివి వైస్ చైర్మన్ మంగా అప్పన్న, కో-ఆప్షన్ సభ్యుడు బంగారాజు, అక్కిరెడ్డి దేవుడుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

ప్రజాశక్తి -ఆనందపురం : భీమిలి డివిజన్ పరిధిలో యూరియా కొరత లేదని ఆనందపురం వ్యవసాయాధికారి సంధ్య రత్నప్రభ తెలిపారు. మొత్తం 10,307 హెక్టార్ల విస్తీర్ణానికి గాను 2025 సంవత్సరానికి అవసరమైన యూరియా 2400 మెట్రిక్ టన్నులు, డిఎపి 900 మెట్రిక్ టన్నులు ఇప్పటికే సరఫరా చేసినట్లు తెలిపారు. వరి పంటలకు కావలసిన దానికన్నా ఎక్కువ ఎరువులు డీలర్లు, రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేశామని, అదనంగా 48 మెట్రిక్ టన్నుల యూరియా ఈ వారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రైతులకు బలవంతంగా నానో యూరియా ఇస్తున్నారనడంలో నిజంలేదన్నారు.

టిడిపి విశాఖ పార్లమెంట్ కమిటీ అధ్యక్ష రేసులో బమ్మిడి ఉమ

ప్రజాశక్తి- ఆనందపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు విశాఖ జిల్లా పార్లమెంట్ కమిటీల నియామకానికి ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి అధ్యక్షతన ఈ నెల 26న ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఆనందపురం మండలం లోడగలవానిపాలెం గ్రామానికి చెందిన మాజీ జడ్‌పిటిసి బమ్మిడి ఉమ పేరు విశాఖ పార్లమెంట్ కమిటీ అధ్యక్ష రేసులో వినిపిస్తోంది. 1983లో తెలుగుదేశం పార్టీ స్థాపన నుంచి జెండా పట్టి, పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన నాయకురాలిగా ఉమకు గుర్తింపు ఉంది. జడ్‌పిటిసి సభ్యురాలిగా సేవలందించారు. ఆమె భర్త సూర్యనారాయణ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ స్థాపకుడు నందమూరి తారక రామారావు కాలం నుంచే టిడిపిలో బమ్మిడి కుటుంబం బలమైన అనుబంధాన్ని కలిగి, పార్టీ కోసం పనిచేస్తోంది. 'పార్టీలో ఏ పదవి ఇచ్చినా బాధ్యతతో నిర్వర్తిస్తానని, జిల్లా పార్లమెంట్ కమిటీ అధ్యక్ష పదవి వస్తే మరింత సేవ చేయడంతో పాటు జిల్లాస్థాయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను' అని బమ్మిడి ఉమ ఈ సందర్భంగా తెలిపారు.

కార్మికుల పక్షపాతి రామారావు

రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : కార్మికుల పక్షపాతి జి.రామారావు అని సిఐటియు గాజువాక జోన్ కార్యదర్శి ఎల్.బంగారు నాయుడు అన్నారు. ఇటీవల మృతిచెందిన సిపిఎం సానుభూతిపరులు జి.రామారావు సంతాప సభ సోమవారం గాజువాక ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుకన ఉన్న ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారునాయుడు మాట్లాడుతూ, రామారావు సర్వీస్ కాలంలో కార్మికుల, పేద ప్రజల సమస్యలపై పనిచేశారని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కొత్త చట్టాలు తేకపోగా, ఉన్న చట్టాలను రద్దు చేస్తోందని, వాటిని కాపాడుకోవడం కోసం పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె.కోటేశ్వరరావు, కె.కిరీటం, ఎం.సుబ్బన్న, వై.శరత్చంద్ర, రాజేంద్రప్రసాద్, డాక్టర్ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

'కృష్ణాపురం' భూముల సర్వే

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామంలో రైతులు సాగుచేసుకుంటున్న భూముల్లో రెవెన్యూ అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. ఎస్‌ఐవిఎస్ పార్కు నిర్మాణం కోసం గ్రామంలో భూసేకరణ చేపట్టిన భూముల్లో తమకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ పలువురు రైతులు సిపిఎం ఆధ్వర్యాన పలు రూపాల్లో ఆందోళన చేస్తున్నారు. దీనిపై స్థానిక తహశీల్దార్ కె.ఆనందరావు ఇచ్చిన హామీ మేరకు సోమవారం సర్వే చేపట్టడంతో రైతులు తహశీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత రైతులకు హక్కు కల్పించి ప్రభుత్వానికి అప్పగిస్తామని తహశీల్దార్ వివరించారు. రైతులు అనుమతి మేరకు ప్రభుత్వం భూ సేకరణలో భాగంగా నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. రైతులు వంటా ఒర్పు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

సెయింట్ ఆన్స్‌లో చైతన్య కార్యక్రమాలు

ప్రజాశక్తి -ములగాడ : సెయింట్ ఆన్స్ కళాశాలలో సోమవారం పలు చైతన్య కార్యక్రమాలను నిర్వహించారు. గణిత శాస్త్ర విద్యార్థినులు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేసి తమ ప్రతిభను చాటారు. రసాయన శాస్త్ర విద్యార్థినులు నీటి వనరుల పొదుపు, పర్యావరణ పరిరక్షణపై ఇంటింటి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈనెల 29వ తేదీన నిర్వహించబోయే మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంప్రదాయ దుస్తుల పోటీని తెలుగు విభాగం నిర్వహించింది. వీటన్నిటిలో విద్యార్థినులు చురుకుగా పాల్గొని, సామాజిక అంశాల పట్ల తమ నిబద్ధతను తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి అభినందించారు.

జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 40వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలను సోమవారం ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబర్ 8వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. నేత్ర దానం చాలా గొప్పదన్నారు. నేత్ర దానంపైన ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ చాలా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రాంతీయ నేత్ర వైద్య శాల సూపరింటెండెంట్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి మాట్లాడుతూ, ఈ 15 రోజులు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ ఎవి.రమణ, డాక్టర్ మాధవి, ఆర్ఎంఒ నవీన్‌కుమార్, ఉమ, శ్రీనివాస్, ఆర్.సురేష్, పూర్ణిమ, సుజాత పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : వినాయక చవితి ఉత్సవాల్లో నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు తెలిపారు. మండపాల వద్ద, నిమజ్జన సమయంలో డిజె సౌండ్ సిస్టం నిషేధమని పేర్కొన్నారు. పందిళ్లకు 11 రోజులకు మించి అనుమతులు లేవన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల ఏర్పాటుకు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రోడ్లపై మండపాలు ఏర్పాటు చేయరాదని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మహాసభలో ఉమామహేశ్వరరావు
- మున్సిపల్ కార్మికుల ప్రదర్శనతో ఎరుపెక్కిన గోపాలపట్నం

ప్రజాశక్తి -గోపాలపట్నం : పోరాటాలతోనే సమస్యలను పరిష్కరించుకోగలమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మహాసభ సందర్భంగా సోమవారం గోపాలపట్నం బిఆర్‌టిఎస్ రోడ్డులో వర్షాన్ని లెక్కచేయకుండా వేలాది మున్సిపల్ కార్మికులు మహా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పెట్రోల్ బంకు వద్ద టి.నూకరాజు అధ్యక్షతన బహిరంగ సభ ఏర్పాటుచేశారు. ఈ సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో సిఐటియు అనేక పోరాటాలు నిర్వహించడం ద్వారా వేతనాలు పెంపుదల, హక్కులు సాధన జరిగిందని చెప్పారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో 94 చోట్ల సిఐటియు జెండా ఎగురుతోందని తెలిపారు. రాష్ట్రంలో మున్సిపల్ రంగాన్ని స్తంభింప చేయగల సత్తా సిఐటియుకే ఉందన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల రాష్ట్ర సమ్మెలో భాగంగా 124 జిఒ సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, విలీన పంచాయతీ కార్మికులకు మినిమం టైమ్ స్కేల్ చెల్లించుటకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని, ఇన్కమ్ టాక్స్ 4.5 కోట్లు కార్మికుల అకౌంట్లో జమ చేయించడం జరిగిందని, 1200 మంది కార్మికుల కుటుంబ సభ్యులకు డెత్, రిటైర్డ్ పోస్టులు ఇప్పించినట్లు తెలిపారు. రూ.1100 జీతం ఉన్న పారిశుధ్య కార్మికులకు రూ.21 వేలు, క్లాప్ డ్రైవర్లకు రూ.12 వేల నుంచి రూ.18,500, నీటి సరఫరా అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.15 వేల నుంచి రూ.18,500 చెల్లింపులు సిఐటియు పోరాట ఫలితమని చెప్పారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మరో రూ.3 వేలు చెల్లింపునకు జిఒలు సాధించినట్లు తెలిపారు. మానవ హక్కుల కోర్టులో ప్రభుత్వం మీద కేసు వేసిన ఫలితంగా రూ.6 వేలు హెల్త్ అలవెన్స్ సాధించిన ఘనత సిఐటియుకే ఉందన్నారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, టెండర్ సొసైటీలను రద్దు చేయించి గుర్తింపు యూనియన్ల దోపిడీ నుంచి కార్మికులకు జీతాలు, పిఎఫ్, ఇఎస్ఐలను సక్రమంగా చెల్లించేటట్టు, వారి కష్టార్జితాన్ని బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసేటట్టు సిఐటియు చేసిందని గుర్తుచేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు మాట్లాడుతూ, పోరాట పటిమను కొనసాగించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీర రమణ, ఎంవి.ప్రసాద్, బి.రత్నం, జెఆర్.నాయుడు, ఈశ్వరరావు, శ్రవణ్, జి.రాము, పెంటారావు రమణ, అనిల్, నాని, సిహెచ్.కృష్ణంరాజు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో ప్రదర్శన నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు, చిత్రంలో ఉమామహేశ్వరరావు తదితరులు

డిఎస్‌సి ఫలితాల్లో మెరిసిన యువకులు

చిప్పాడ గణపతి

పల్లి శంకర్

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆనందపురం : ఇటీవల విడుదలైన డిఎస్‌సి ఫలితాల్లో ఆనందపురం మండలానికి చెందిన ఇద్దరు యువకులు ప్రతిభ కనబరిచారు. మండలంలోని బంటుపల్లి గ్రామానికి చెందిన పల్లి శంకర్ జిల్లా వారీగా 68వ ర్యాంకును తొలి ప్రయత్నంలోనే సాధించారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన శంకర్, తండ్రి రాజు కరోనా సమయంలో మృతి చెందడంతో కుటుంబం కష్టాలను ఎదుర్కొంది. తల్లి నాగమణి, సోదరులు వీరాస్వామి, ప్రసాద్ ప్రోత్సాహంతో రెండేళ్లుగా ఆన్‌లైన్ ద్వారా పరీక్షకు సిద్ధమై డిఎస్‌సిలో ర్యాంక్ సాధించారు. విద్యార్థులకు ఉన్నతమైన విద్య అందించడమే తన లక్ష్యమని శంకర్ చెప్పారు.

కుశులువాడ గ్రామానికి చెందిన చిప్పాడ గణపతి డిఎస్‌సిలో 14వ ర్యాంకు సాధించాడు. ఇటీవల జరిగిన కానిస్టేబుల్ పరీక్షల్లో కూడా రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకు సాధించడం విశేషం. తల్లిదండ్రులు చిప్పాడ అమ్మతల్లి దేవుడమ్మ ప్రథమ కుమారుడు గణపతి, తల్లిదండ్రులు కూలి పనులు చేస్తుంటారు. చిన్నాన్న చిప్పాడ పాపునాయుడు ప్రైవేట్ పాఠశాలలో పిఇటిగా పనిచేస్తూ విద్యపై ఆసక్తి పెంచారు. గ్రూప్ వన్ సాధించడమే తన తుది లక్ష్యమని గణపతి తెలిపారు.

లోవరాజు

సీతమ్మధార : డిఎస్‌సిలో అక్కయ్యపాలేనికి చెందిన ఎస్.లోవరాజు స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్‌లో 40వ ర్యాంకు సాధించాడు. టిజిటి సైన్స్ రెసిడెన్షియల్ జోన్-1 కటగిరి లో 70వ ర్యాంకు, టిజిటి సైన్స్ మోడల్ స్కూల్ జోన్ 1 కేటగిరిలో 120వ ర్యాంకు సాధించారు. మూడు కేటగిరిల పరీక్షలు మంచి ర్యాంకులు వచ్చినందుకు స్థానికులు అభినందించారు.

బాడీ బిల్డింగ్‌లో సత్తా

పతకాలతో ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి-సీతమ్మధార : ది-ఐసిఎన్ ఇండియా హైదరాబాద్ డెక్కన్ బాడీ బిల్డింగ్ క్రీడల్లో విశాఖ యువకుడు సత్తా చాటాడు. ది-ఐసిఎన్ ఇండియా హైదరాబాద్ డెక్కన్ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ క్రీడల్లో జివిఎంసి 53వ వార్డు పరిధి డాక్టర్ జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతానికి చెందిన రాయి ప్రవీణ్ కుమార్ (18) నాలుగు కేటగిరీలలో మూడు స్వర్ణ పతకాలు, ఒక సిల్వర్ పతకం సాధించాడు. ప్రవీణ్ కుమార్ ఐటిఐ పూర్తి చేశాడు. తండ్రి నూక రాజు స్థానికంగా కూలి పనులు చేస్తుంటాడు. చిన్న తనం నుంచి వ్యాయామంపై ఆశక్తి పెంచున్న ప్రవీణ్ కుమార్ ఆ దిశగా తీవ్రంగా శ్రమించాడు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రం కావడంతో దాతలు సహకరిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తానని ప్రవీణ్ కుమార్ అంటున్నాడు. ప్రవీణ్ కుమార్ బాడీ బిల్డింగ్ పోటీల్లో నాలుగు పతకాలు సాధించడంతో జాకీర్ హుస్సేన్‌నగర్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పిజిఆర్‌ఎస్‌కు పలు వినతులు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 7 అర్జీలు అందినట్లు జోనల్ కమిషనర్ బమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. రెవెన్యూ, ఇంజినీరింగ్, యుసిడి విభాగాలకు సంబంధించి ఒక్కొక్కటి, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 4 అర్జీలు అందినట్లు పేర్కొన్నారు. వీటిని తదుపరి చర్యల నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు తెలిపారు

వేపగుంట : జోన్ -8 కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌కు 17 ఆర్జీలు వచ్చినట్లు జోనల్ కమిషనర్ హైమావతి తెలిపారు.

వినాయక మండపాలకు 84 దరఖాస్తులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో వినాయక మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో 84 దరఖాస్తులు వచ్చాయని సిఐ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. గణపతి మండపాల ప్రాంగణంలోనూ, ఊరేగింపులోనూ డిజె సౌండ్ నిషేధం అని పేర్కొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్న కార్పొరేటర్ మొల్లి హేమలత

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ జిల్లా పరిధిలో పలుచోట్ల స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం లబ్ధిదారులకు పంపిణీచేశారు.

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ జిల్లాలో క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు 5616 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్టు కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం ఎంవిపి.కాలనీ, అప్పుఘర్‌లోని చౌక ధరల దుకాణం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబుతో కలిసి పాల్గొన్నారు. డిపో నెంబరు 0387201 పరిధిలోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్డులో కుటుంబ పెద్ద ఫొటోతో పాటు కుటుంబ సభ్యుల వివరాలన్నీ క్రోడీకరించి ఉంటాయని, రేషన్ డిపోలో డీలర్ వద్ద స్కాన్ చేసిన వెంటనే వివరాలన్నీ తెలుస్తాయని అన్నారు. ఈ నెల 31వ తేదీ వరకూ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కార్డుల పంపిణీ చేస్తారని చెప్పారు. జూన్ 30వ తేదీ వరకు అర్జీ పెట్టుకున్న వారికి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ తర్వాత లబ్ధిదారులు సంబంధిత రేషన్ డిపోలలో కొత్త స్మార్ట్ కార్డులను పొందవచ్చునన్నారు. మరలా సెప్టెంబర్ 15వ తేదీ నుండి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రేషన్‌కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 5 లక్షలా 17 వేల స్మార్ట్ కార్డ్‌లు పంపిణీ చేయనున్నామన్నారు. అందులో 35 వేల నూతన కార్డులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గొలగాని కృష్ణవేణి, డిఎస్ఒ వి.భాస్కరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డులోని 129 సచివాలయం పరిధి రామకృష్ణానగర్, చాకలిపేటలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, ముక్కా కిషోర్ కుమార్, పి.లక్ష్మణ పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గంలో స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆధ్వర్యాన పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో శ్యామల దీపిక, నజీర్, బార్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

కొమ్మాది: జివిఎంసి 5వ వార్డు పరిధి రాజీవ్ గృహకల్ప సచివాలయం 76, 77 నెంబర్ల పరిధిలోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను కార్పొరేటర్ మొల్లి హేమలత అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, రేషన్ డీలర్లు అనేష్ కుమార్, సంజీవ్, విఆర్‌ఒలు దిలీప్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న రేషన్ డిపోల్లో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. రెడ్డిపల్లి గ్రామంలో జడ్‌పిటిసి కె.దామోదరరావు కార్డులను పంపిణీ చేశారు.

మధురవాడ :జివిఎంసి 6వ వార్డులోని సచివాలయాల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, పోలిశెట్టి నాగేశ్వరరావు, లోడగల జానకిరామ్ పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డులోని డిపో 221, 223, 228ల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి సన్యాసిరావు, గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు. జివిఎంసి 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, వార్డు టిడిపి అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు ఆధ్వర్యాన కార్డులను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నీలి పైడిరాజు, యల్లమిల్లి సురేష్, మజ్జి రమణి పాల్గొన్నారు. జివిఎంసి 10వ వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మిరాజశేఖర్ ఆధ్వర్యాన కార్డులను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో గాడు అప్పలనాయుడు, మద్దిల రాజేష్, బండి రాజా రమేష్, పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి జెవి.అగ్రహారంలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, జోనల్ కమిషనర్ బమ్మి అయ్యప్పనాయుడు, ఎపి కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు పంచకర్ల సందీప్, పాల్గొన్నారు

ఆనందపురం : ఆనందపురం మండలం కణమాం గ్రామపంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ ఆబోతు అప్పలరాము పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొలగాని కృష్ణ, చందవరపు కుమార్ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మిడ్డేమీల్స్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

మహాసభలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి

ప్రజాశక్తి-సబ్బవరం : మధ్యాహ్నం భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గునూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం సంఘం జిల్లా మహాసభ జిల్లా అధ్యక్షులు కె.ప్రసన్న అధ్యక్షత జరిగింది. 19 మండలాల నుండి 120 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మహాసభల్లో గత కార్యక్రమాల సమీక్ష, భవిష్యత్తు కర్తవ్యాలపై చర్చించడం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్న కార్మికుల పరిస్థితి మారటం లేదని, కనీస వేతనాలు అమలు కావటం లేదని, రాజకీయ వేధింపులు, తొలగింపుకు ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ప్రమాద బీమా సౌకర్యం లేదన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్కీమ్ వర్కర్లపై వేధింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, యూనియన్ నాయకులు ఎం శ్రీదేవి, గౌరీ, పార్వతి, ఎస్ అమ్మాజీ, శ్రీలక్ష్మి, వ్యాస నాయకులు సత్యవతి, నాయినబాబు, చంటి, సంఘం విశాఖ జిల్లా కార్యదర్శి మంగశ్రీ కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మిడ్డేమీల్స్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి

కోశాధికారి రాజేష్, అధ్యక్ష, కార్యదర్శులు రూపాదేవి, వెంకటలక్ష్మి

విఒఎల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపీ వెలుగు విఒఎ (యానిమేటర్లు) ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా 4వ మహాసభలో 40 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన ఈ మహాసభలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులుగా వివి.శ్రీనివాసరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సిహెచ్ రూపాదేవి, ఎస్ వెంకటలక్ష్మి, కోశాధికారిగా సిహెచ్ఎల్ఎన్.రాజేష్, కార్యదర్శివర్గంగా కె.కనకలక్ష్మి (కోటవురట్ల), ఎం.రాజ్యలక్ష్మి (నర్సీపట్నం), జి.సత్యవతి (రావికమతం), అప్పలనాయుడు (చీడికాడ), భవాని (కసింకోట), ఉష (మునగపాక), కె.సూరిబాబు (దేవరపల్లి), లావణ్య (అచ్చుతాపురం), క్రాంతి (నాతవరం), రాము (అనకాపల్లి), మరో 25మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన అధ్యాపకునిపై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న ఐద్వా నేత మాణిక్యం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిపై లైంగిక వేధింపులకు, బ్యాడ్ టచ్‌కు పాల్పడిన సైన్స్ లెక్చరర్ జి.శ్రీధర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 23వ తేదీన జరిగిన ఈ ఘటనపై ఇప్పటికే పరవాడ పోలీస్ స్టేషన్లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయించినట్లు పేర్కొన్నారు. బాధిత విద్యార్థినిని ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా జాయింట్ సెక్రటరీ సిహెచ్.మంగతాయారు మాట్లాడుతూ కాలేజీ ఎదుటే పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఘటన జరిగి మూడు రోజులైనా నిందితుడిపై ప్రభుత్వం, పోలీసులు సత్వర చర్యలు తీసుకోకపోవడం సరికాదని, వెంటనే అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించాలని డిమాండ్ చేశారు.

మంచి క్రీడాకారులను తయారు చేయాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో క్రీడాలను ప్రోత్సహించి, మంచి క్రీడాకారులను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కన్ఫరన్స్ హాల్లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి జిల్లా క్రీడా అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. యువత వ్యసనాలకు బానిసకాకుండా క్రీడాల వైపు మొగ్గు చూపే విధంగా క్రీడా మైదానాలు సిద్ధం చెయ్యాలని కమిటీ సభ్యులకు సూచించారు. నర్సీపట్నం, అనకాపల్లి మున్సిపాలిటీ పరిధిలో భూమిని సేకరించి ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో మోడల్లో స్విమ్మింగ్ ఫూల్కు సంబందించిన ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలోని గుర్తించిన 15 మండల కేంద్రాల్లో 20 సెంట్లు చొప్పున భూమిని సేకరించడం జరిగిందని, వాటిని సమగ్రంగా పరిశీలించి వాలీబాల్ కోర్టులు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని కోరారు. కార్యక్రమంలో జెసి ఎం జాహ్నవి, డిఆర్ఒ వై.సత్యనారాయణ రావు, క్రీడాలు అభివృద్ధి అధికారి ఎల్ వెంకట రమణ, జెడ్పి డిప్యూటీ సిఇఒ రాజకుమార్, డిపిఒ సందీప్, వివిధ శాఖ అధికారులు మంజుల వాణి, పూర్ణిమా దేవి, మున్సిపల్ కమిషనర్లు, ఎపిఐఐసి డిప్యూటీ మేనేజర్ రాజశేఖర్, సమగ్ర శిక్ష ఇంజనీర్ నరసింహమూర్తి, పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సైన్స్ ద్వారా విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి అప్పారావు నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఇన్స్పైర్ మోనాక్ కార్యక్రమంలో భాగంగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఈవో పాల్గొని జిల్లాను సైన్సు పాఠ్యాంశంలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఈ శిక్షణకు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 135 మంది ఫిజికల్, బయోలాజికల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్స్ గా ఉపాధ్యాయులు ఎస్ బాబురావు, వి సుజాత, బికెవి గోవిందరావు, వి గిరిప్రసాద్, కె ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి డి. కాళిదాసు పాల్గొన్నారు.

డైరెక్టర్లకు ఘన సన్మానం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలం నుండి పెందుర్తి మార్కెట్ కమిటీకి డైరెక్టర్లుగా ఎన్నికైన గొర్లి కనకారావు (మాజీ సర్పంచ్), కొత్తపల్లి అపర్ణలను టిడిపి మండల అధ్యక్షుడు వియ్యపు చిన్నా సోమవారం టిడిపి కార్యాలయంలో ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో బొండా తాతారావు (మాజీ సర్పంచ్), రాయవరపు దేవుడు (మాజీ సర్పంచ్), సారిపల్లి జోగినాయుడు (మాజీ ఎంపిటీసీ), గొర్లి శ్రీనివాసు (మాజీ ఎంపిటీసీ), పైల వరలక్ష్మి (తెలుగు మహిళా అధ్యక్షురాలు), బండారు ముసిలినాయుడు ఇతర నాయకులు పాల్గొన్నారు.

దౌర్జన్యానికి దిగుతున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలో పాత బడిన ఇళ్లను రిపేర్ చేసుకుందామని పేద, మధ్యతరగతి వారు ప్రయత్నిస్తే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది గెద్దలవలే వాలిపోయి లంచాలకు డిమాండ్ చేస్తూ దౌర్జన్యాలకు దిగుతున్నారని సిపిఐ నాయకులు కోరిబిల్లి శంకర్రావు, వైఎన్ భద్రం, తాకాసి వెంకటేశ్వరరావు, మత్తుర్తి సూరిబాబు, కొణతాల శ్రీనివాసరావు మండిపడ్డారు. సోమవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వీరిపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులచే ఎంక్వయిరీ చేస్తే నిజానిజాలు బయటపడతాయని జీవీఎంసీ ముఖ్య కమిషనర్ను కోరారు. లేకుంటే పేద, మధ్యతరగతి ప్రజల తరపున సిపిఐ ఆందోళన దిగుతుందని హెచ్చరించారు.

ఎరువుల అక్రమ విక్రయంపై విజిలెన్స్ కొరడా

స్వాధీనం చేసుకున్న నకిలీ ఎరువులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : అనుమతి లేకుండా నకిలీ ఎరువులను అక్రమంగా విక్రయిస్తున్న ఎరువుల షాపుపై విజిలెన్స్ అధికారులు దాడి చేసి కేసు నమోదు చేశారు. మండలంలోని కే.సంతపాలెం గ్రామంలో గాయత్రి ఎరువుల దుకాణానికి అనుమతి లేని గ్రాన్యూలేటెడ్ మిక్సర్ కాంప్లెక్స్ ఎరువుల బస్తాలు తెలంగాణ రాష్ట్రం నుండి లారీలో దిగుమతి చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఎరువుల బస్తాలు షాపులో దించుతుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఇందులో 400 బస్తాలు గాయత్రి షాపుకు చెందినవి కాగా మరో 200 బస్తాలు శ్రీకాకుళం జిల్లా రణస్థలంకు చెందినవి. కె.సంతపాలెం లో పట్టుబడిన గాయత్రి రైతు డిపో వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగికి చెందినది కావడం గమనార్హం. షాపు నిర్వహిస్తున్న మరో పార్టనర్ కింతాడ హరీష్‌పై అధికారులు కేసు నమోదు చేశారు. సుమారు 8.42 లక్షల విలువ గల నిషేధిత ఎరువుల బస్తాలను సీజ్ చేసి కె కోటపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్స్పెక్టర్ టి.అప్పలనాయుడు, ఎస్ఐ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి ఎమ్‌వి సోమశేఖర్ పాల్గొన్నారు.

రేపు వైద్య కళాశాలపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-కోటవురట్ల : మాకవరపాలెం మండలంలో గత ప్రభుత్వంలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కాలేజీ అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు వేదిక నాయకులు తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మాకవరపాలెం మెడికల్ కాలేజీ నిర్మాణ భవనం వద్ద జరుగు కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ అభిప్రాయాలు చెప్పాలని కోరారు. రూ.500 కోట్లతో నిర్మించ తలపెట్టిన మెడికల్ కాలేజీ పనులు నిలిపివేయడంతో పాటు నిర్మాణ సామాగ్రిని తరలించుకుపోవడం పట్ల పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని తెలిపారు. అందరూ హాజరై కలిసి ఉమ్మడిగా స్పందిస్తే ఫలితం ఉంటుందని, మీ విలువైన అభిప్రాయం అందించేందుకు హాజరుకావాలని కోరారు.

పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కశింకోట : పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎపి పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కశంకోటలో సోమవారం సమావేశం జరిగింది. ఇందులో పంచాయతీ కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ ప్రాణాలను సైతం ఫణంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. తక్షణమే వారికి పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేతనంతో కూడిన ఇతర సెలవులు, అర్హులైన వారికి అటెండర్, తదితర శాశ్వత ఉద్యోగాలు, ఉద్యోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు ప్రతినెలా సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.కొండబాబు, సత్తిబాబు, అబ్బులు, ఆర్.అప్పల నరసమ్మ, టి.అంజి, ఇ.అర్జునమ్మ, ఒ.పెద్ద అప్పారావు, డి.పోలయ్య, వై.అప్పలకొండ, సిహెచ్.నూకరత్నం, డి.సూరప్పారావు, జి.సత్యారావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : యూరియా కోసం రైతులు సోమవారం ఉదయం 6గంటల నుంచి మండలంలోని చౌడువాడ పిఎసిఎస్ వద్ద బారులు తీరారు. సొసైటీలో లోను తీసుకున్న రైతులు వారి భూమి పాస్ పుస్తకాలు లైన్‌లో పెట్టి తమ వంతు వచ్చే వరకు సొసైటీ ఎదుట కూర్చున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసన తరుణంలో యూరియా, డిఎపి ఎరువులు అవసరం ఉన్నందున వాటి కొరకు పడికాపులు కాస్తున్నారు. చౌడువాడ సొసైటీ వద్ద రుణం పొందిన రైతులకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియా చొప్పున అందిస్తున్నట్లు సొసైటీ సీఈవో బత్తిన సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం కూడా యూరియా ఉన్న మేరకు అందజేస్తామని చెప్పారు.

మునగపాక : స్థానిక పిఎసిఎస్ వద్ద సోమవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. లైన్‌లో ఉన్న రైతులను సిపిఎం మండల నాయకులు ఎస్.బ్రహ్మాజీ కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ మునగపాకలో 200 నుండి 300 టన్నులు రైతులకు యూరియా అవసరం కాక అరకొరగా యూరియా పంపిణీ చేసి చేయి దులుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

పిజిఆర్ఎస్‌కు 344 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 344 అర్జీలు వచ్చాయి. వాటిని కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్ఒ వై.సత్యన్నారాయణరావు స్వీకరించారు. ప్రజల అర్జీలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎస్ సుబ్బలక్ష్మి, రామమణి, ఎస్‌డి అనిత, డిఇఒ అప్పారావు నాయుడు, గృహనిర్మాణ, డ్వామా పీడీలు శ్రీనివాస్, పూర్ణిమ దేవి, డిఎంహెచ్ఒ హైమావతి, ఎక్సైజ్ అధికారి వి.సుధీర పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా 46 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్పై వెంకన్న, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేసిన తారు రోడ్డు

రహదారి ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలోని రామచంద్రపురం శివారు అల్లుమయ్యపాలెం గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు రహదారి గుర్తు తెలియని ట్రాక్టర్ డ్రైవర్లు దుక్కు సెట్‌తో ధ్వంసం చేయడం పట్ల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులంటే ఇంత చులకన అంటూ ప్రశ్నిస్తున్నారు. గిరిజన ప్రాంతానికి సమీపంలో ఉన్న రైతులంతా గిరిజనేతరులేనని, రహదారిని ధ్వంసం చేయడం పట్ల చర్యలు చేపట్టాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

28 నుండి నిరుద్యోగులకు ఎంఎస్‌ఎంఇ శిక్షణ

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని అనకపల్లి కాలనీలో వరల్డ్ బ్యాంక్ సౌజన్యంతో డ్రెడ్జ్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిరుద్యోగులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంఎస్‌ఎంఈ శిక్షణ ఈ నెల 28 నుండి ప్రారంభిస్తున్నట్లు కన్వీనర్ పి.విజయ్ కుమార్ తెలిపారు. ఈ శిక్షణ సెప్టెంబర్ 16వ తేదీ వరకు జరుగుతుందన్నారు. పరిశ్రమ ఏర్పాటు, లాభనష్టాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, బడ్జెట్ కార్యాచరణ, ఆన్లైన్ బిజినెస్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని, పూర్తయిన తరువాత ఎంఎస్‌ఎంఇ సర్టిఫికెట్, ఉద్యమ రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న 18 నుండి 40 సంవత్సరాలు కలిగిన స్త్రీ, పురుషులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. రెండు పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు, కుల ధ్రువపత్రం, విద్యార్హత ధ్రువపత్రాలు తీసుకురావాలని, మరిన్ని వివరాలకు కో-ఆర్డినేటర్ 9963174608 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-కశింకోట : లంకెలపాలెం హైస్కూల్‌లో ఈ నెల 24న జరిగిన జిల్లా స్థాయి టెన్ని కాయిట్ పోటీల్లో మండలంలోని వెదురుపర్తి హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని శ్రీజల, తొమ్మిదో తరగతి విద్యార్థిని హాసిని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి టెన్ని కాయిట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు వారిని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కెఆర్ఎస్ఎన్.నాయుడు సోమవారం అభినందించారు. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

బాలికల రక్షణ, బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం భార్గవి విద్యా మందిర్ పాఠశాలలో శక్తి టీమ్ సభ్యులు బాలికల రక్షణ, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట ఏఎస్ఐ ఎన్.మణికుమారి మాట్లాడుతూ ఆకతాయిల నుంచి బాలికలు ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు. పోక్సో చట్టం, శక్తి మొబైల్ యాప్ గురించి వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు ఏఎస్ఐను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డి.రవి, హెచ్ఎం డివి.లక్ష్మి, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని పెంటకోట గ్రామంలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఎస్సీ కాలనీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో యువత నూతనంగా ఏర్పాటు చేసుకున్న "నాటు గుంటల యూత్" లోగోను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యాలయం వద్ద రూ.2 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న బహుళార్ధ సాధక మత్స్య కేంద్రం, రూ.1.52 కోట్లతో నిర్మిస్తున్న పెంటకోట, అరట్లకోట కల్వర్టులకు శంకుస్థాపన చేశారు. టిడిపి సీనియర్ నాయకులు, శ్రీరాంపురం పిఎసిఎస్ ఛైర్మన్ చిక్కాల శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్ (పద్దు), పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాలబాబు, ఎంపిటిసి కొనాడ లక్ష్మణ్, పార్టీ సీనియర్ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, గూటూరు శ్రీను, మైలపల్లి అశోక చక్రవర్తి, గొర్లె రాజుబాబు, మజ్జూరి నారాయణరావు, పల్లా విలియం కేరీ, మల్లపురెడ్డి రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని

ఆటో కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పరవాడ : మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన పరవాడ సంతబయలు వద్ద ఆటో కార్మికులు సోమవారం నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ ఈ నెల 28న తహశీల్దారు కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. చదువుకున్న నిరుద్యోగులకు ప్రభుత్వం ఉపాధి కల్పించకపోవడంతో ప్రైవేట్ ఫైనాన్స్ దగ్గర అప్పులు చేసి, బ్యాంకుల్లో రుణాలు తీసుకొని ఆటోలు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు బేరాలు తగ్గి ఫైనాన్స్ కూడా చెల్లించలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీల అమలు చేయాలని, వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ.25వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న నాగరాజు తదితరులు

ప్రజాశక్తి- యంత్రాంగం

వినాయక చవితి నేపథ్యంలో పలుచోట్ల సోమవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

కొమ్మాది : ఆయుష్ హాస్పిటల్ ఆర్థిక సహాయంతో ఏర్పాటుచేసిన వినాయకుని మట్టి ప్రతిమలను జివిఎంసి 5వ వార్డు పరిధి ముత్యాలమ్మ ఆలయం వద్ద కార్పొరేటర్ మొల్లి హేమలత పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ హాస్పిటల్ డాక్టర్లు లావణ్య సంబంగి, అమన్ సాయి, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి రామకృష్ణానగర్‌లో మట్టి వినాయక విగ్రహాలను 4వ పట్టణ పోలీసుస్టేషన్ సిఐ ఉమాకాంత్, కార్పొరేటర్ ముక్కా శ్రావణి పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ముక్కా కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి కృష్ణానగర్‌లో ఐక్యత సేవా సంఘం ఆధ్వర్యాన 800 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు సంఘం గౌరవాధ్యక్షులు ఏరా నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఐక్యత సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మధురవాడ : ఆయుష్ హాస్పిటల్ యాజమాన్యం సహకారంతో జివిఎంసి 7వ వార్డులో మట్టి వినాయక విగ్రహాలను 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ నిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ హాస్పిటల్ డాక్టర్ అమన్ పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 70వ వార్డు పరిధి చట్టివానిపాలెంలోని భాస్కర్ విద్యానికేతన్‌లో మట్టి వినాయక ప్రతిమలను విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కర రావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది హేమలత, శైలజ, సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆనందపురం : పర్యావరణాన్ని కాపాడాలని సందేశమిస్తూ వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. 'మట్టితో చేసిన వినాయకులు వాడండి - పర్యావరణాన్ని కాపాడండి" అనే నినాదంతో ప్రధానోపాధ్యాయులు దాడిశెట్టి రమేష్ కుమార్ ఆధ్వర్యాన మట్టి వినాయక విగ్రహాలను పట్టుకొని గ్రామ వీధుల్లో తిరిగారు. అనంతరం విద్యార్థులకు 100 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీచేశారు.

మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలో మట్టి వినాయక ప్రతిమలను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చందరం సూరిఅప్పారావు, దాడి గంగాజీ, ఎం.వీరునాయుడు, దాడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం జంక్షన్ వద్ద శ్రీకారం సేవా సమితి, సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం నేతలు ప్రజలకు సోమవారం ఉచితంగా మట్టి వినాయకుని విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జొన్నకోట చెన్నమూర్తి, సూదికొండ మాణిక్యాలరావు, చందాన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : కె.కోటపాడు అయ్యన్న స్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీల విద్యార్థులు మట్టితో తయారు చేసిన మట్టి ప్రతిమలను విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం ఆధ్వర్యాన సోమవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ భుజంగరావు, ఎంపీడీఓ సాంబశివరావు, ఉప తహసీల్దార్ రాజా శ్రీధర్, ఎంఇఒలు సత్యనారాయణ, ప్రసాద్, ఎంపిడిఒ కార్యాలయం ఏఓ అప్పలరాజు, పోలీస్, రెవెన్యూ శాఖల అధికార్లకు, ఉద్యోగులకు అందచేశారు.

మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న సాయికృష్ణ

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : చోడవరంలో సెప్టెంబర్ 6, 7 తేదీల్లో జరిగే సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పివిన్వి పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం జరిగిన అనకాపల్లి మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు రక్షణ కల్పించాలని, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని కోరారు. ఎగుమతి, దిగుమతి వాహనాలను అనకాపల్లి సిటీలోకి అనుమతించక పోవడం వల్ల ముఠా కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, వాటిని అనుమతించాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల శంకర్రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గంటా శ్రీరామ్ పాల్గొన్నారు.

మండల సమన్వయ కమిటీ ఎన్నిక

అనంతరం సిఐటియు మండల సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా కాళ్ళ తేలయ్యబాబు, సభ్యులుగా పివిన్వి పరమేశ్వరరావు, గంటా శ్రీరామ్, మందా రాము, టి సురేష్ బోడి రాజు వై.ఏసు రాజు, బొమ్మాల రాము, ఎన్ వరలక్ష్మి ఎం సూర్య కళ, ఎం సూర్యలక్ష్మి ఎం.అప్పలరాజు బి.అప్పారావు, ఎంపీ నాయుడు, కె నాయుడు, కె.నాగేశ్వరరావు వారాధి సత్యనారాయణ, కొండారావు తదితరులు ఎన్నికయ్యారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వరలక్ష్మి, ఐద్వా నాయకులు

ఐద్వా జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలో ఈ నెల 31న జరుగు ఐద్వా జిల్లా మహాసభకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆ సంఘం జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి ఆధ్వర్యాన సోమవారం కశింకోటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయని, మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం ఏరులై పారుతుందని, మద్యం, గంజాయి నిషేధించాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో బస్సులు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అప్పలనరస, సన్యాసమ్మ, లక్ష్మి, నూకరత్నం పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఐద్వా జిల్లా మహాసభ వాల్ పోస్టర్‌ను అచ్యుతాపురంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం మాట్లాడుతూ అచ్యుతాపురం రహదారి విస్తరణలో భాగంగా చిరు వ్యాపారాలు చేసుకుంటున్న మహిళలకు ఉపాధి సమస్య ఏర్పడిందని, వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.కుమారి, జే.విజయ, సిహెచ్ మంగతాయారు, ఆర్.పార్వతి ఎస్.సుధా, వి.బాల తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

సిఐ స్వామినాయుడు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలంలో వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాలు ఏర్పాటుకు పోలీస్ పర్మిషన్ గురించి పోలీస్ స్టేషన్‌కు రానవసరం లేదని, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కశింకోట సిఐ అల్లు స్వామినాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన https://ganeshutsav.net లింక్ ద్వారా లాగిన్ అయ్యి అందులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్ అప్రూవల్ అయిన తర్వాత మీ యొక్క పూర్తి వివరణలతో ఒక క్యూఆర్ కోడ్ జనరేట్ చేయబడుతుందని తెలిపారు. వినాయక మండపం పెట్టేటప్పుడు ట్రాఫిక్ అంతరాయం, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పెట్టుకోవాలని, వాటికి కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత వహించాలని సూచించారు.

స్నేహితునికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-మునగపాక : తమతో విద్యనభ్యసించిన కస్పా అప్పలనాయుడు బస్సు ప్రమాద కారణంగా మంచాన పడటంతో 1999-2000 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. మండల కేంద్రం మునగపాక గ్రామానికి చెందిన అప్పలనాయుడు దువ్వాడలో గల ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవారు. ఇటీవల కంపెనీలో విధులు ముగించుకుని తిరిగి వస్తున్న సందర్భంగా బస్సు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగి శస్త్ర చికిత్స జరగటంతో ఇంటికి పరిమితమయ్యాడు. చలించిపోయిన గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు అప్పలనాయుడును పరామర్శించి రూ.25 వేలు తమ వంతు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పిల్లా జగదీష్, టెక్కలి అప్పలనాయుడు, ఉల్లూరి రాము, దాడి అరుణ్ కుమార్, బొడ్డేటి చంద్రశేఖర్, కస్పా శ్రీను, మిత్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా వెంకటలక్ష్మి ఎంపిక

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్సీ జువాలజీ చదువుతున్న ఎన్.వెంకటలక్ష్మి ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలోని ఉత్తమ ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆమెను సోమవారం అభినందించారు. అలాగే ఇటీవల ఆంధ్రా యూనివర్సిటీ ఫోర్త్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు ఎస్ గాయత్రి కంప్యూటర్స్, ఎస్ వెంకటలక్ష్మి జువాలజీ 9.3 పాయింట్స్, వై.మాధవి, పి.హర్షవర్ధని, ఆర్.హాని ఇతర విద్యార్థులు అత్యుత్తమ సిజిపి ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాల అధ్యాపక సిబ్బంది సదరు విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.

అర్హులందరికీ ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేసారు. సోమవారం నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయంలో డిఎల్ పురం పంచాయతీ సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి ఎం రాజేష్‌తో కలిసి ఆర్‌అండ్‌ఆర్ అధికారి వివి రమణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ కారిడార్ భూసేకరణలో నిర్వాసితులకు రూ.25 లక్షల ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, వివాహితులకు వర్తింపజేయాలని, ఆర్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మండలంలో రాజయ్యపేట, బోయపాడు, బుచ్చిరాజుపేట, బుచ్చిరాజుపేట కొత్తూరు, చందనాడ పంచాయతీలో కర్రివారి వీధి, తమ్ముల పేట, తమ్మయ్యపేట, అమలాపురం పంచాయతీలో పాటిమీద, మూలపర్ర, డిఎల్ పురం పంచాయతీలో వాడపేట గ్రామాల్లో 745 కుటుంబాలను పెద బోదుగలం వద్ద పునరావాసం కల్పించి తరలించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న అప్పలరాజు, రామకృష్ణ

అయితే ప్రభుత్వం ప్రకటించిన రూ.8.98లక్షల ఆర్‌ఆర్ ప్యాకేజీ ఆమోదయోగ్యం కాదని నిర్వాసితుల అభ్యంతరం వ్యక్తం చేస్తూ పోరాటాలు చేస్తున్నా వాటి బ్యాంకు అకౌంట్లను తీసుకోవడం చట్టఉల్లంఘనేనన్నారు.ప్రకాశం జిల్లా, వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆనాటి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.12.50 లక్షల ప్యాకేజీ చెల్లించారని, కడప జిల్లా, గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.10 లక్షలు, పోలవరం ఎడమ కాలువ నిర్వాసితులకు రూ.10 లక్షలు ప్యాకేజీ చెల్లించారన్నారు. ఇపుడు ధరాభారానికి అనుగుణంగా రూ.25లక్షలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ పెంచాలని, పెండింగ్ పరిహారం, తోటలు, ఇతర ఆస్తులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె దాసు పాల్గొన్నారు.

పాల సొసైటీ అధ్యక్షురాలిగా వరలక్ష్మి

నూతన అధ్యక్షురాలితో విశాఖ డెయిరీ పాల సంఘం సభ్యులు

ప్రజాశక్తి -మాడుగుల: మండల కేంద్రంలోని విశాఖ డెయిరీ పాల సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఉప్పల అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రశాంతంగా నిర్వహించిన ఎన్నికల్లో బండారు వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలసంఘం పరిధిలోని 113 మంది సభ్య రైతులు ముందుగా బొడ్డేటి నాగరాజు, వేచలపు సత్తిబాబు ఇద్దరు డైరెక్టర్లు ఎన్నిక కోగా, మరో ఎనిమిది మంది డైరెక్టర్లతో పాల సంఘం అధ్యక్షురాలిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వేతన కార్యదర్శి గండి జోగినాయుడు, సభ్య రైతులు ఎడ్ల హేమంత్ కుమార్,పాము శ్రీను, గండి జగన్నాథం పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఎంఇఒను కలిసిన నవోదయ కరస్పాండెంట్

ప్రజాశక్తి- రావికమతం : రావికమతం మండల విద్యాశాఖాధికారిగా బదిలీపై వచ్చి విధుల్లో చేరిన లింగమూర్తిని సోమవారం స్థానిక నవోదయ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ జె. చంద్రశేఖర్ పట్నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఇఒ లింగమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు పాఠశాల నిర్వహణ జరగాలని సూచించారు. రికార్డులు అప్‌డేట్‌గా ఉండాలని,విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు.

నవోదయ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ చంద్రశేఖర్ పట్నాయక్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతోపాటు ఆటలు, క్విజ్ పోటీలు, కాంపిటేటివ్ పరీక్షలకు తర్ఫీదునిస్తున్నట్లు తెలిపారు.

అధిక ధరలకు ఎరువుల విక్రయాలు?

ప్రజాశక్తి- మాడుగుల : ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కాకుండా, అధిక రేట్లకు ఎరువులను విక్రయిస్తూ నిలువుదోపిడి చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పారదర్శకంగా ఈపాస్ విధానంలో ఎరువులను రైతులకు అందజేయాలని ఒకవైపు జిల్లా కలెక్టర్ నుంచి ఇతర అధికారులు, నేతలు ప్రకటిస్తుండగా, మండలంలో పలు ఎరువుల దుకాణాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు వాపోతున్నారు.

ఆర్‌బికెల్లో రూ.270లకు ఇచ్చే యూరియా బస్తాలనే, ప్రయివేటు ఎరువుల దుకాణాల్లో రూ. 350 నుంచి రూ.380 వరకు విక్రయిస్తున్నారని రైతులు అంటున్నారు. సోమవారం ఘాట్‌రోడ్డులో ఎరువుల దుకాణం వద్దకు వెళ్లగా, స్టాక్ అయిపోయిందని బోర్డు పెట్టిన వ్యాపారి, తర్వాత రూ.80 నుంచి రూ.110 వరకు అదనంగా ఇస్తే యూరియా ఇస్తామని బ్లాక్ మార్కెట్‌లో అమ్మకానికి పెట్టాడని రైతులు వాపోతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు దృష్టి, ఎరువుల కృత్రిక కొరత, అధిక ధరలకు అమ్మకాలపై తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఎరువులు నిల్వలు ఉంచుకొని కూడా ఇవ్వడానికి వెనకాడుతున్నారని, అధికంగా డబ్బులు ఇచ్చిన వారికి ఎరువుల బస్తాలు ఇచ్చి పంపిస్తున్నారని రైతు తాడినాయుడు ఆవేదన చెందాడు. దీనిపై వ్యవసాయశాఖ అధికారి అనుసూయను వివరణ కోరగా, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పారదర్శకంగా అమ్మాలని వ్యాపారులందరినీ హెచ్చరించామన్నారు. అధిక ధరలకు విక్రయాల ఆరోపణలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

స్నేహితురాలికి ఆర్థిక చేయూత

స్నేహితురాలిని పరామర్శిస్తున్న పూర్వ మిత్రులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పాత కృష్ణదేవి పేట గ్రామానికి చెందిన కయ్యం లక్ష్మీ ఆర్థికంగా ఇబ్బంది పడడం చూసి తనతో పాటు కలిసి చదివిన నాతవరం మండలం శృంగవరం గ్రామం చెందిన టిడిపి నాయకులు సుర్ల నూకరాజు సోమవారం కయ్యం లక్ష్మి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అంతేకాకుండా తనకు తోచిన విధంగా రూ.5వేలు నగదు, ఒక బియ్యం బస్తాను అందజేశారు.అలాగే సుర్ల వెంకటరావు రూ. వెయ్యి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నూకాంబిక ఆలయ చైర్మన్ కొరుప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రికార్డుల తారుమారుతో అన్యాయం

ప్రజాశక్తి-రోలుగుంట : జిరాయితీ భూమిని ఇనాం భూమిగా రికార్డుల్లో తారుమారు చేసి, తప్పుడు పత్రాలు సృష్టించి రెవెన్యూ అధికారులు తమకు అన్యాయం చేస్తున్నారని మండలంలోని జెపి.అగ్రహారం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జెపి.అగ్రహారం రామకోవెల వద్ద విలేకర్లతో మాజీ సర్పంచ్ రొంగల రమణ, దుంగల బుచ్చిరాజు, శంకర్ మాట్లాడుతూ తమ తాత తండ్రుల నుండి 419 ఎకరాల భూమిలో సాగులో ఉన్నామన్నారు. ప్రారంభంలో ఆరుగురు రైతులు ఉండేవారని, ప్రస్తుతం సుమారు 200 మంది రైతులు సాగులో ఉన్నామన్నారు. తమ పూర్వీకులు ఎన్నిసార్లు తహశీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగినా రికార్డు లేదని నమ్మ బలికేవారని, తాము 2021 అప్లై చేయగా అప్పటి తహశీల్దార్ శ్రీనివాస్ రికార్డులు అందజేశారన్నారు. తప్పుడు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన తహశీల్దార్‌పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలన్నారు.

మాట్లాడుతున్న బాధిత రైతులు

31న విశాఖలో ప్రజాసంకల్ప వేదిక ఉత్తరాంధ్ర జిల్లాల సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ : విశాఖపట్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 31వ తేదీన ప్రజా సంకల్పవేదిక ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లల విస్తృతస్థాయి సమావేశం జరగనుందని హ్యూమన్ రైట్స్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి నెల్లూరి చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ అధ్యక్షులు మాదిరి రంగసాయిరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు జక్కు నరసింహమూర్తి, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జ్ బుద్ధపు బంగారురాజు ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి ప్రజా సంకల్ప వేదిక ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జాతీయ అధ్యక్షులు మాదిరి రంగసాయిరెడ్డి, జాతీయ కార్యదర్శి(మీడియా), జర్జలిజం రాష్ట్ర అధ్యక్షులు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నరేష్, ఉత్తరాంధ్ర ప్రజా సంకల్ప వేదిక ప్రతినిధులు అందరూ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమం అనంతరం సమాజంలో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు రాష్ట్ర స్థాయి సేవారత్న అవార్డులను అందజేస్తారన్నారు.

గణపతి ఉత్సవాలకు పందిరి రాట

.పందిరి రాట వేస్తున్న గ్రామ పెద్దలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉపమాక గ్రామంలో రామాలయం వద్ద ఈనెల 27 నుంచి నిర్వహించనున్న గణపతి నవరాత్రి ఉత్సవాలకు సోమవారం గ్రామ పెద్దలు పందిరి రాట వేశారు. ఇక్కడ ఏటా ఆనవాయితీగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, శివాలయం మాజీ ఛైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, గ్రామపెద్దలు సిద్దాబత్తుల కృష్ణ, నూక తాత, దవరసింగి సన్యాసిరావు (బాబ్జి), ప్రగడ బుజ్జి, అనపర్తిజగ్గారావు, బద్దిహరిబాబు, జోగారావు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు ఇ-పాస్ పరికరాలు

ప్రజాశక్తి -పాడేరు: డిఆర్ డిపో డీలర్లకు ఈపాస్ పరికరాలను జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎంజె అభిషేక్ గౌడ సోమవారంపంపిణీ చేసారు. పాడేరు మండలంలో ఉన్న 45 డిఆర్ డిపోలలో 65 ఏళ్ల నిండిన లబ్దిదారులకు పైలట్ ప్రాజెక్టు కింద ముందుగా ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. రేషన్ పంపిణీని పారదర్శకంగా జరగాలన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోండి

మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్న భూములు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని కుసర్లపూడి రెవెన్యూ పరిధిలో కేతవరపు జగన్నాధం అసోసియేషన్ భూమిలో రాత్రుళ్లు జేసిబిలతో అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని మాజీ ఉప సర్పంచ్ చిటికెల బుల్లిబాబు కోరారు.. 663, 672, 686, 687 సర్వే నెంబరు భూమిలో నిత్యం ఈ దందా సాగుతోందని ఆరోపించారు. జెసిబిలతో తవ్వి, టిప్పర్లతో తరలించడం వల్ల సిసి రోడ్లు, ఇతర రహదారులు గోతులమయమై పాడౌతున్నాయన్నారు. భూయాజమానులు విశాఖపట్నంలో ఉండడంతో స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో అక్రమ తవ్వకాలు సాగుతున్నాయని దీనిపై నిఘాపెట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమంగా మట్టిని తరలించి రూ.లక్షలు సంపాదిస్తున్నారని,వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని దుంగలి సత్తిబాబు కోరారు.

లోవరాజుకు అభినందన

లోవరాజును అభినందిస్తున్న ఎంపిటిసి బచ్చల రాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : మెగా డిఎస్‌సిలో 244 ర్యాంకు సాధించి, ఉపాధ్యాయ ఉద్యోగానికి అర్హత సాధించిన మండలంలోని ఉద్దండపురం గ్రామానికి చెందిన దొంగల లోవరాజును సోమవారం ఎంపిటిసి బచ్చల రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు అభినందించి, సత్కరించారు.

రెల్లలపాలెం గ్రామానికి రోడ్డు వేయరూ!

● డోలీ మోతలతో ఆదివాసీల వినూత్న నిరసన

డోలీలతో నిరసన వ్యక్తం చేస్తున్న రెల్లలపాలెం గిరిజనులు

ప్రజాశక్తి - చీడికాడ : తమ గ్రామానికి వాలాబు నుండి రోడ్డు సౌకర్యం కల్పించాలని చీడికాడ మండలంలో కోనాం పంచాయతీలో రెల్లలపాలెం ఆదివాసీ గిరిజనులు సోమవారం డోలీ మోతలతో వినూత్నంగా నిరసన చేపట్టారు. రెల్లలపాలెం వరకు రోడ్డు సదుపాయం కల్పించాలని ఆదివాసీ గిరిజనులు డోలీలతో సోమవారం వినూత్న నిరసన చేశారు ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా ఐదోవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి. నరసింహమూర్తి మాట్లాడుతూ రెల్లలపాలెం గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసరం, నిత్యావసరాలకు అనునిత్యం గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యలను వివిధ ఆందోళనలు, వినతులు రూపంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, కలెక్టర్ ఆదేశాలతో దేవరపల్లి మండలం వాలాబు పంచాయతీ కేంద్రం నుంచి రెల్లలపాలెం వరకు మూడు కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి రూ. 4 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించి నివేదించారని,. అయితే ఇంతవరకు నిధులు మంజూరు, పనులు చేపట్టకపోవడంతో ఆవేదన చెందుతున్నారన్నారు రెల్లలపాలెం గిరిజనులు తమ అటవీ ఉత్పత్తులు అమ్ముకోవడానికి, నిత్యావసరాలు కొనుక్కోవడానికి సుమారు పది కిలోమీటర్లు దూరంలో ఉన్న కోనాం సంతకు కాలినడకన వెళ్లి, తల, భుజాలపై మోసుకుని తెచ్చుకోవడం తప్ప గత్యంతరం లేదన్నారు. వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో బాధపడే వారైతే రెల్లలపాలెం నుంచి బయటకు రావాలంటే గగనమే అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారన్నారు. నిరసనలో కోమటి.గంగరాజు, కోట దేముడు. సోమల సూర్యనారాయణ, దేముడమ్మ, దాయిరి భవాని గ్రామస్తులు పాల్గొన్నారు

ఆదివాసీ యువతికి మెడికల్ సీటు

గుళ్ల జగన్మోహిని

ప్రజాశక్తి- రావికమతం : మండలంలో కవగుంట పంచాయితీ శివారు బుడ్డిబంద గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన విద్యార్థిని గుళ్ళ జగన్మోహిని 2025 నీట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకు సాధించి మెడికల్ సీటును దక్కించుకుంది. గుళ్ళ అప్పందర, తల్లి ముత్యాలమ్మ దంపతుల రెండవ కుమార్తె జగన్మోహిని 10వ తరగతి, ఇంటర్మీడియట్ మరుపాక ఆదర్శ పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగించింది. అనంతరం విశాఖపట్నం వైభవి కాలేజ్‌లో లాంగ్ టెర్మ్ కోచింగ్ తీసుకొని 2025 నీటి పరీక్షలో 720/404 మార్కులు సాధించి ఎస్టి కేటగిరీలో 3052 ర్యాంకు సాధించి రాజమహేంద్రవరం జిఎస్ఎల్ఆర్ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది.జగన్మోహిని ఏడేళ్ల వయసులో తండ్రి గుళ్ళ అప్పందర ప్రమాదంలో మరణించగా, తల్లి ముత్యాలమ్మ సంరక్షణలో ఉంటూ, తల్లి కూలి సంపాదనతోనే చదువుకుంటోంది. తల్లి ముత్యాలమ్మ కష్టాన్ని నీరుగార్చకుండా మొదటి నుంచి బాగా చదువుతూ, జగన్మోహిని మెడికల్ సీట్ సాధించింది. జగన్మోహినిని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు, ఉప సర్పంచ్ కిముడు రమేష్ గంగాభవాని, సీనియర్ హైస్కూలు ఉపాధ్యాయులు గుళ్ళ వరహాల దొర, లైన్‌మ్యాన్ వరహాల దొర, ఫైర్ మ్యాన్ సాసుబిల్లి గంగరాజు, పలువురు గ్రామస్తులు అభినందించారు. చదం అసాధ్యమైన తరుణంలో సుసాధ్యం చేసి అందరిని ఆశ్చర్యపరిచింది. 150 మంది ఓటర్లు కలిగినటి చిన్న కుగ్రామంలో ఇరువురు హై స్కూల్ టీచర్స్, ఒకరు నేవీ, మరొకరు ఎలిమెంటరీ టీచర్,ఎలక్ట్రికల్ లైన్‌మాన్, డాక్ యార్డ్, ఫైర్‌మ్యాన్ ఎస్.ఐ, ఐటి, స్టీల్‌ప్లాంట్, ఏఎన్ఎం, ఐటీవిల డిఎస్‌సిలో ఒక మహిళకు ఎస్‌జిటి పోస్టు ఇలా ఒక్కరొక్కరుగా పలువురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చదువుతున్న చిన్నారులకు వీరంతా స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారన్నారు.

కొనసాగిన దళిత రైతుల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న కోడూరు రైతులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : రాళ్ళ క్వారీని రద్దు చేయాలని 34రోజులుగా నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేస్తున్న మాకవరపాలెం మండలం జి.కోడూరు దళిత రైతులు సోమవారం నేలపై కూర్చొని వినూత్న ఆందోళన చేపట్టారు. 34 రోజులుగా దీక్షలు చేస్తున్నా దళితులనే చులకన భావంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఊర్లో పనులు మానేసి పిల్లాపాపలు, కుటుంబాలతో తాము ఎందుకు నిరసన చేస్తున్నామో కనీసం కన్నెత్తి చూడడం లేదని వాపోయారు.అధికారులు, నేతల నిర్లక్ష్యం తమలో పట్టుదలను మరింత పెంచుతోందని, రాళ్ళ క్వారీని రద్దు చేసేంతవరకు, ప్రాణాలొడ్డైనా పోరాడతామని, వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, దళిత రైతులు భూషణం, చిరంజీవి, సింహాచలం పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ఎండగట్టండి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వైసిపి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాతవరం మండల నాయకులు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ,. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. పాలన ఏడాది గడవినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించిన వైనంపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. దీనిపై తాను గ్రామస్థాయిలో చైతన్యం పెంపొందించేందుకు కృషి చేస్తానన్నారు.

మట్టి గణపతులే మేలు

పలుచోట్ల విద్యార్థుల అవగాహనా ర్యాలీలు

నక్కపల్లిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మట్టి గణపయ్యను పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదామన్న నినాదాలతో సోమవారం చినదొడ్డిగల్లు హై స్కూల్ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లీష్ క్లబ్ వ్యవస్థాపకులు, ఆంగ్ల ఉపాధ్యాయులు వై వెంకటరమణ, ఉన్నతపాఠశాల హెచ్ఎం వి బాలాజీ ఆధ్వర్యంలో. ప్లకార్డులు, మట్టి గణపయ్య విగ్రహాలను చేతపట్టి విద్యార్థులు గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల అనర్థాలపై నినాదాలు చేశారు. రసాయనాలతో కూడిన విగ్రహాలను పూజించిన తర్వాత వాటిని నీటిలో నిమజ్జనం చేస్తే, నీరు కాలుష్య కారకంగా మారడంతోపాటు దాని ప్రభావం జీవరాశులపై పడుతుందని వివరించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు వైవి రమణ విద్యార్థులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ సాంబశివరావు, ప్రసాద్, సునీత, పద్మ పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలను ఉపయోగించాలని ర్యాలీ

అనకాపల్లి : వినాయక చవితి పండగ కోసం మట్టి వినాయక ప్రతిమలను మాత్రమే వాడాలని కోరుతూ సోమవారం మండలంలోని మామిడిపాలెం జడ్పీ హైస్కూల్ గ్రీన్ కార్ప్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నినాదాలు ఇస్తూ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హెచ్‌వి శ్రీధర్, ఉపాధ్యాయులు గొంది చినబ్బాయ్, ఈశ్వరబాబు, నాగమణి, నూకేశ్వరరావు, వరప్రసాద్, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘం నేతలు

బలవంతపు భూ సేకరణ ఆపాలని నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో కూటమి ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్ఇజెడ్‌లు, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్స్ పేరుతో వేలాది ఎకరాలు రైతులు వద్ద 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘించి బలవంతంగా భూములు సేకరించి ప్రైవేటు కంపెనీలకు, కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. రైతులు, కూలీల నోట్లో మట్టి కొట్టి రాష్ట్ర కూటమి ప్రభుత్వం భూ దోపిడీకి పాల్పడుతోందని విమర్శించారు. జిల్లాలో ఉన్న తాండవ, ఏటికొప్పాక, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలను మూసివేసి, వాటి గురించి కనీసం పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు పరిశ్రమల పేరుతో రైతులు దగ్గర బలవంతంగా భూములు లాక్కోవడం దారుణమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తుంటే మాట్లాడకుండా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం ఆగమేఘాల మీద భూ సేకరణ చేపట్టడం దారుణమన్నారు. పచ్చటి పల్లెల్లో కె.కోటపాడు మండలంలో 1200 ఎకరాలు, బుచ్చయ్య పేట మండలంలో 1690 ఎకరాలు, ఎస్.రాయవరం మండలంలో 1291 ఎకరాలు, నక్కపల్లి మండలంలో 9000 ఎకరాలు భూములు సేకరించడానికి సన్నాహాలు చేయడం సరికాదన్నారు. అనంతరం కలెకర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, కోశాధికారి గండి నాయనబాబు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ బ్రహ్మాజీ, నాయకులు ఎం.రాజేష్, కడారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని స్థానిక 50 పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మీ అన్నారు. ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సుమారు పదిమంది యువకులు రక్తదానం చేశారు. వారిని వైద్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు కోటేశ్వరరావు, ఆర్.రమ, జి.వైదేహి, సునీల్, మహేష్, రోజారాణి, కుసుమరాణి, ప్రశాంత్, సురేంద్రబాబు, ఆసుపత్రి బ్లడ్ స్టోరేజ్ యూనిట్ టెక్నీషియన్ నాగేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆర్‌డిఎస్ఎస్ బ్రేకర్ పనుల కారణంగా తుమ్మపాల సెక్షన్, 33/11 కెవి అల్లికానుడిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలలో ఈనెల 26న ఉదయం 10 నుండి రాత్రి 11 గంటల వరకు, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని కసింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ తెలిపారు. వినియోగదారులు సహరించాలని కోరారు.